క్లుప్తంగా

పాఠ్య పుస్తకాల పంపిణీ

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతు 2025–26 విద్యా సంవత్సరానికి ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా పుస్తకాల పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం


ఆయిల్‌పాం మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

శిరివెళ్ల: ఉద్యాన పంటలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నాగరాజు అన్నారు. శనివారం గుండంపాడులో కొత్తగా చేపట్టిన ఆయిల్‌పా ప్లాంటేషన్‌ను పరిశీలించారు. కొత్త పంట సాగు, పెట్టుబడి, దిగుబడిపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగుకు పెట్టుబడి తక్కువన్నారు. సాగునీటి సమస్య ఉందన్నారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పంటను పండించుకోవచ్చని చెప్పారు. సచివాలయ ఉద్యాన సహాయకురాలు సుధ, రైతులు పాల్గొన్నారు.

శాకంబరిగా గాయత్రి మాత


శ్రీ గాయత్రిదేవి

నంద్యాల (వ్యవసాయం): పట్టణంలోని ప్రథమనంది దేవాలయ ఆవరణలోని శ్రీ గాయత్రి ఆలయంలో శనివారం పట్టణ బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని గాయిత్రి మాతను శాకంబరిగా అలంకరించారు. ముందుగా అమ్మవారికి ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని వివిధ కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతిచ్చారు. మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సమాఖ్య శాశ్వత అధ్యక్షుడు విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ ఖాదరబాద్ రవీంద్రనాథ్‌ను సభ్యులు సత్కరించారు. సమాఖ్య అధ్యక్షుడు మురళీకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ఉయ్యాలవాడ : స్థానిక ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈఓ –1 రఘురామిరెడ్డి పరిశీలించారు. శనివారం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన మెనూను ఏజెన్సీ నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో డ్రైనేజీలపై అక్రమ నిర్మాణాలు, వ్యాపారాలు చేస్తున్న వారిని మున్సిపల్ కమిషనర్ శేషన్న ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం ఆక్రమణలు తొలగించారు. జిల్లా కలెక్టర్ పర్యటనతో మున్సిపల్ యంత్రాంగం హుటాహుటీన చేరుకొని పద్మావతి నగర్‌లోని డ్రైనేజీలపై ఆక్రమణలను తొలగించారు. డ్రైనేజీలపై అక్రమ నిర్మాణాలను కూడా తొలగించాలని వ్యాపారులకు సూచించినట్లు కమిషనర్ తెలిపారు.

కొనసాగుతున్న సమ్మె

నంద్యాల(న్యూటౌన్): స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికుల సమ్మె శనివారం కూడా కొనసాగింది. ఏడవ రోజు వంటావార్పు కార్యక్రమంతో నిరసన చేపట్టి భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం సీఐటీయూ నాయకులు గౌస్, లక్ష్మణ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు బాలదుర్గన్న మాట్లాడుతూ ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి కనీస వేతనం రూ.26వేలు అందించాలని డిమాండ్ చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్త

నంద్యాల(అర్బన్): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్త సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా శనివారం రాత్రి పట్టణంలోని రామనాథ థియేటర్, శ్రీనివాససెంటర్ ప్రాంతాల్లో వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

హెల్మెట్ భారం కాదు

శిరివెళ్ల: హెల్మెట్ తలకు భారం కాదని, రక్షణ అని సీఐ దస్తగిరి బాబు అన్నారు. శనివారం జాతీయ రహదారిపై హెల్మెట్ ఉపయోగంపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చాలా మంది హెల్మెట్ ఉన్నా దానిని ధరించకుండా ప్రయాణాలు చేస్తున్నారన్నారు. ప్రమాద సమయంలో తలకు గాయాలై చాలా మంది మరణించారన్నారు. రహదారి నిబంధనల ప్రకారం ప్రయాణాలు చేసే వారు రోడ్డెక్కితే విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఎస్ఐ చిన్న పీరయ్య పాల్గొన్నారు.

ప్రజలను మరోసారి మోసం చేసిన బాబు

- ఎన్నికల ముందు హామీలు ఇచ్చి నెరవేర్చక పోవడం బాబుకు అలవాటే
- గడపగడపకు టీడీపీ మోసాలు వివరిద్దాం
- జగనన్న ప్రభుత్వంలో అమలైన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి
- ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి


సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు


వైఎస్సార్‌సీపీ హయాంలో అమలైన పథకాలను వివరిస్తున్న ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు పక్కన బెట్టి ప్రజలను మరోసారి నిట్టనిలువునా మోసం చేశారని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆళ్లగడ మండల నాయకుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బిజేంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు బహిరంగ సమావేశాల్లో జగన్ అమలు చేస్తున్న అన్ని సంక్షేమపథకాలను అలాగే కొనసాగించడంతో పాటు మరిన్ని పథకాలు అందజేస్తానని హామీ ఇచ్చారన్నారు. గతంలో ఎన్నికల అనంతరం ఎలా మోసం చేశారో ఈసారి కూడా అన్ని వర్గాల ప్రజలను దగాచేశారన్నారు.

ఆదర్శంగా నిలిచిన జగనన్న

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి ఆదర్శంగా నిలిచారని మాజీ ఎమ్మెల్యే కొనియాడారు. ఐదేళ్ల పాలనలో జగనన్న రాష్ట్రాన్ని పదేళ్లు ముందుకు తీసుకెళితే చంద్రబాబు ఏడాది పాలనలో రాష్ట్రాన్ని 20 ఏళ్లు వెనక్కి నెట్టేశారన్నారు. సంక్షేమ పథకాలు అందక అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అధికారంలోకి వస్తే మీ కుటుంబానికి ఏడాది ఇంత.. ఐదేళ్లకు ఇన్ని డబ్బులు వస్తాయని ఎన్నికల ముందు స్థానిక టీడీపీ నేతలు ఇంటింటికి తిరిగి బాండ్లు పంచిపెట్టారని, హామీలు అమలు చేయకపోతే కాలర్ పట్టుకొని అడగాలని లోకేష్ చెప్పారని గుర్తుచేశారు. ఇప్పుడు గ్రామాల్లోకి వెళ్తే అన్ని వర్గాల వారు అప్పుడు ఇంటి దగ్గరకు వచ్చి బాండ్లు ఇచ్చిన నాయకుల కాలర్ పట్టుకోవడానికి ఎదురు చూస్తున్నారన్నారన్నారు. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ప్రజలందరికీ గుర్తు చేయడానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

కలిసి పనిచేద్దాం..

మండలంలోని నాయకులు, ప్రజా ప్రతినిధులు అందరం కలిసికట్టుగా పనిచేసి వైఎస్సార్‌సీపీని మరోసారి అధికారంలోకి తెచ్చుకుని ఆళ్లగడ్డకు ఎమ్మెల్యేగా గంగుల నానిని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని ఆళ్లగడ్డ ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మరోసా విప్లవాత్మక పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుద్దామన్నారు. గ్రామాల్లో టీడీపీ అంటే ప్రజలు తరిమేసే పరిస్థితి నెలకొందని, ప్రభుత్వంపై పోరాటం చేసే సమయం ఆసన్నమైందని, ప్రజలకు తోడుగా వైఎస్సార్‌సీపీ నాయకులు నిలుస్తారని చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కొట్టి నాగేశ్వర్‌రావు, పట్టణ కన్వీనర్ కూలూరు నరసింహారెడ్డి, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు

మార్గదర్శకులు అపోహలు వీడాలి


మాట్లాడుతున్న డ్వామా పీడీ శ్రీధర్‌రెడ్డి

ఉయ్యాలవాడ : బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శకులు అపోహలు వీడాలని జిల్లా డ్వామా పీడీ, మండల ప్రత్యేకాధికారి శ్రీధర్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని బోడెమ్మనూరు గ్రామ సచివాలయంలో బంగారు కుటుంబాలు, మార్గదర్శకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయం పరిధిలో 34 బంగారు కుటుంబాలను పి–4 సర్వే ద్వారా గుర్తించడం జరిగిందన్నారు. సచివాలయ ఉద్యోగులు మళ్లీ గృహాల వద్దకు వస్తారని, ఎవ్వరైనా బంగారు కుటుంబాలు మిగిలి వుంటే యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. దత్తత తీసుకోవడం అంటే ఆర్థికంగా ఆదుకోవాల్సిన అవసరం లేదన్నారు. తెలియని వారికి మాట సహాయం చేయడం కూడా చేయవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సువర్ణాదేవి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ నాగలక్ష్మమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేయండి


సమస్యలు వింటున్న రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయ

నంద్యాల(అర్బన్): విద్యుత్ సమస్యలపై వచ్చే వినియోగదారుల పట్ల అధికారులు నిర్లక్ష్యం వీడి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని రిటైర్డు జడ్జి శ్రీనివాస ఆంజనేయ సూచించారు. స్థానిక ఈఈ కార్యాలయ ఆవరణలోని పవర్ హౌస్ కాంపౌండ్‌లో ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 60 మంది వినియోగదారుల అర్జీలను స్వీకరించి సమస్య పరిష్కారానికి మార్గాలు చూపారు. డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్న కార్యక్రమంలో రిటైర్డు జడ్జి మాట్లాడుతూ విద్యుత్ సమస్య ఏదైనా తక్షణమే పరిష్కారమయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. దీర్ఘకాలిక సమస్యలు, రాతపూర్వక ఫిర్యాదులకు త్వరితగతిన పరిష్కారం చూపాలని చెప్పారు. ఆర్థిక సభ్యులు మధుకుమార్, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి, ఎస్ఈ సుధాకర్‌కుమార్, ఈఈ శ్రీనివాసరెడ్డి, అంకా మహేశ్వరరావు, పారిశ్రామికవేత్తలు గెలివి రామకృష్ణయ్య, నెరవాటి రవి, అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమష్టి పోరాటాలు


ఆర్ఎస్పీ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ప్రజా సమస్యల పరిష్కారానికి సమష్టి పోరాటాలు చేస్తామని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని, అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాసులు, కల్యాణ్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని నిశాంత్‌భవన్‌లో ఆర్ఎస్పీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు అధ్యక్షతన రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 2.30 లక్షల పోస్టులు భర్తీ చేయాలని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు గోపి, రాము, లక్ష్మిదేవి, విజయ, కేశవ, తిమ్మక్క పాల్గొన్నారు.

సంక్షిప్తం

పీఆర్సీ ఏర్పాటు చేయాలి

నంద్యాల(అర్బన్): ఉద్యోగుల పీఆర్సీ సత్వరమే ఏర్పాటు చేయాలని ఏపీ ఎన్జీఓ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు వెంగళరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీఓ హోంలో శనివారం ఆంధ్రప్రదేశ్ నాన్ గజిటెడ్, గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమ ముఖ్యఅతిథి వెంగళరెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు విడుదల చేయాలని కోరారు. నంద్యాల తాలూకా అధ్యక్షుడు హుసేన్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు మణిశేఖర్‌రెడ్డి, కార్యదర్శి నర్సారెడ్డి, /అన్ని తాలూకాల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీ కొని వ్యక్తికి గాయాలు

ఆళ్లగడ్డ : స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో బస్సు ఢీకొని సుబ్బయ్య అనే వ్యక్తి తీవ్రంగ గాయపడ్డాడు. శనివారం రాత్రి పట్టణానికి చెందిన సుబ్బయ్య బస్టాండు సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా వెనుకవైపు నుంచి ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడ్డ సుబ్బయ్యను స్థానిక వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పట్టణ పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ఆళ్లగడ్డ : మండలంలోని నల్లగట్ల గ్రామంలో పురుగుల మందు తాగి శివమ్మ (18) అనే వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. రూరల్ ఎస్ఐ వరప్రసాద్ తెలిపిన వివరాల మేరకు శివమ్మకు రెండు మాసాల క్రితం వివాహం అయింది. ఆశాఢమాసం కావడంతో శివమ్మ పుట్టింట్లో ఉంటోంది. ఈ క్రమంలో శనివారం శివమ్మ తల్లి సుబ్బమ్మ పొలం పనులకు వెళి వచ్చేసరికి ఇంట్లో ఉన్న శివమ్మ పనిచేయకుండా పడుకొని ఉంది. దీంతో పనిచేయకుండా అలా పడుకొని ఉంటే ఎలా అని తల్లి మందలించి పక్కన ఉన్న పశువుల కొట్టం దగ్గరకు వెళ్లింది. అంతలోపే శివమ్మ ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. గమనించిన ఇరుగుపొరుగు వారు ఆసుపత్రికి తరలించినా కోలుకోలే మృతి చెందింది. కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై తెలిపారు

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

గోస్పాడు: విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా మానిటరింగ్ ఆఫీసర్ మాధవీలత సూచించారు. శనివారం దీబగుంట్లలో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ బోధించే పాఠ్యాంశాలు, పరీక్షలపై ప్రణాళిక బద్దంగా యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని చెప్పారు. విద్యార్థులకు సులభ పద్ధతిలో పాఠ్యాంశాలు అర్థమయ్యేలా బోధన సాగించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను ఇప్పటినుంచే నిర్వహించాలని చెప్పారు. అనంతరం బదిలీపై వెళ్లిన హెచ్ఎం కళా సుభాషినిని సన్మానించారు. ఎంఈఓ అబ్దుల్ కరీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లను కూల్చడం ఆపాలి

నంద్యాల (వ్యవసాయం): అసోంలో పేద, మైనార్టీ వర్గాల ఇళ్లను కూల్చడం వెంటనే ఆపాలని ఎస్‌డీపీఐ నాయకులు కోరారు. శనివారం సోషియల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా దేశవ్యాప్త నిరసనలో భాగంగా స్థానిక గాంధీ చౌక్‌లో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఎస్‌డీపీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హఫీజ్ అతావుల్లాఖాన్ మాట్లాడుతూ అసోంలోని బీజేపీ ప్రభుత్వం రాక్షసత్వంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. నాయకులు ఎజాస్ హుసేన్, బాబా ఫక్రుద్దీన్, హనీఫ్, మాజీద్ ఖాన్, సులేమాన్, సుల్తాన్ పాల్గొన్నారు.

రోబోటిక్ చికిత్సలతో మెరుగైన ఫలితాలు


ప్రసంగిస్తున్న డాక్టర్ చంద్రశేఖర రెడ్డి

గోస్పాడు: రోబోటిక్ శస్త్ర చికిత్సలతో మెరుగైన ఫలితాలు వస్తున్నాయని యశోద ఆసుపత్రి యూరాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ గోపీచంద్, జీర్ణాశయ వైద్య నిపుణులు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలో ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్యులకు వైద్య సదస్సు నిర్వహించారు. హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్ సహకారంతో మధుమణి ఆసుపత్రి సమావేశ భవనంలో యూరాలజీ, జీర్ణాశయ చికిత్సలలో ఆధునిక విధానాలు అనే అంశంపై నంద్యాల ప్రాంత వైద్యులకు అవగాహన కల్పించారు. యూరాలజీ నిపుణుడు డాక్టర్ గోపీచంద్ మాట్లాడుతూ రోబోటిక్ శస్త్ర చికిత్సలో మూత్రపిండాలు, మూత్రశయం, ప్రొస్టేట్ శస్త్ర చికిత్సలతో మెరుగైన నిర్దిష్ట ఫలితాలు సాధించడానికి అవకాశం ఏర్పడిందన్నారు. అలాగే వ్యాధిగ్రస్తులు ఆసుపత్రిలో ఉండే సమయం తగ్గుతుందన్నారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ, నంద్యాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్లు మధుసూదనరావు, పనిల్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, డాక్టర్లు అనిల్ కుమార్, సహదేవుడు, అక్బర్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్, జేసీ

నంద్యాల: స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సిబ్బందిని ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో చేపట్టిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌తో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌లోని ప్రతి కార్యాలయం, పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు, సిబ్బంది కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్ ఆవరణలో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు.

- **నంద్యాల(అర్బన్):** ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీపీ ప్రభాకర్, ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిషేధానికి అందరూ సన్నద్ధం కావాలంటూ ప్రతిజ్ఞ చేశారు. ఎంఈఓ బ్రహ్మంనాయక్, డిప్యూటీ ఎంపీడీఓ శివనాగజ్యోతి, ఏఓ షాను పాల్గొన్నారు.
- **గోస్పాడు:** పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ అమానుల్లా అన్నారు. గ్రామాల్లో ఆయా పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంనిర్వహించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. డిప్యూటీ ఎంపీడీఓ నాగఅనసూయ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఉయ్యాలవాడ : ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మోడల్‌స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండు ఆవరణలో తహసీల్దార్ సువర్ణాదేవి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, ఎంఈఓ రఘురామిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు విజయకుమార్‌తో పాటు ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, అధ్యాపక, ఉపాధ్యాయ బృందంతో కలిసి మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల వ్యాధులు ప్రబలే ఆస్కారం వుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవడం అన్ని విధాలా అందరికి ఆరోగ్య శ్రేయస్కరమన్నారు. అంతకముందు పాఠశాల ఆవరణలో ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలను విద్యార్థులతో కలిసి అధికారులు ఏరివేశారు.

- **దొర్నిపాడు:** స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని డబ్ల్యూ కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారి వృసేని ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి బాబయ్య, పర్యవేక్షణాధికారి భాగ్యమ్మ, సీనియర్ అసిస్టెంట్ కన్నయ్య తదిరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి

రుద్రవరం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో శనివారం వివిధ శాఖల అధికారులు స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రమైన రుద్రవరంలో ఎంపీపీ బాలస్వామి, ఎంపీడీఓ భాగ్యలక్ష్మి వివిధ శాఖల ఉద్యోగు లు, నర్సాపురంలో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ఆ యా గ్రామాల పాఠశాల విద్యార్థులతో స్వచ్ఛ ఆంధ్రపై ర్యాలీ నిర్వహించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిర్మూలిద్దాం అనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

పేదల భవితకు బంగారు బాట

రుద్రవరం: ప్రభుత్వం చేపట్టిన పీ–4 కార్యక్రమం పేదల భవితకు బంగారు బాట అవుతుందని తహసీల్దారు మల్లికార్జునరావు అన్నారు. మండల పరిధిలోని ఆలమూరులో శనివారం మార్గదర్శి బంగారు కుటుంబాల్లో భాగంగా ఆయన గ్రామ సర్పంచు పాణ్యం లక్ష్మీదేవి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో 50 బంగారు కుటుంబాల ఎంపికతో పాటు ఏడుగురు మార్గదర్శకులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మీరాంబీ, పంచాయితీ కార్యదర్శి పాములేటి ఉన్నారు.

పంట రుణాల మంజూరు

శిరివెళ్ల: వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాలకు ఖరీఫ్ పంట రుణాలు మంజూరయ్యాయని కేడీసీసీ బ్రాంచి మేనేజర్ రేణుక శనివారం తెలిపారు. రూ. 1.30 కోట్ల దీర్ఘ కాలిక రుణాలు మంజూరయ్యాయని, మరో రూ. 3 కోట్ల రుణాలకు ప్రతి పాదనలు పంపామన్నారు. తమ బ్రాంచి ద్వారా వాహనాలు, ఇళ్లు, ఉన్నత చదువుల కోసం రుణాలు ఇస్తామన్నారు. వాహనాల కోసం రూ.20 లక్షలు, ఉన్నత చదువుల కోసం రూ.40 లక్షలు, ఇళ్ల కోసం రూ. 75 లక్షల వరకు రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. డిపాజిట్లు చేసే వారికి సీనియర్ సిటిజన్లకు 8.25 శాతం, ఇతరులకు 7.5 శాతం వడ్డీ ఇస్తామన్నారు. అలాగే సంఘాలన్నీ కంప్యూటరైజేషన్ జరిగాయని మార్చి నుంచి రైతులకు ఆన్‌లైన్ రశీదులు ఇవ్వడం ప్రారంభమైందని చెప్పారు.

పనుల నిలిపివేత

శిరివెళ్ల: యర్రగుంట్ల ఎస్సీ కాలనీ శ్మశానలో జరుగుతున్న పనులను శనివారం రెవెన్యూ అధికారులు నిలుదల చేశారు. శ్మశానం వద్ద ఉన్న ఓ ఇటుకల తయారీ ఫ్యాక్టరీ యజమాని స్థలం తనదని చెప్పి శనివారం ప్రొక్లై న్‌తో చదును చేయడం ప్రారంభించారు. దీంతో ఎస్సీలు ఆందోళన చెంది విషయాన్ని తహసీల్దార్ జయశ్రీకి లిఖిత ఫిర్యాదు చేశారు. ఆమె ఆదేశాల మేరకు వీఆర్వోలు నాగరాజు, హసీనా హుటా హుటిన వెళ్లి పనులను నిలుపుదల చేశారు. స్థలం తనదని యజమాని వీర్వోలతో వాదించారు. డాక్యుమెంట్ పరిశీలన, సర్వే జరిగే వరకు పనులు చేయవద్దని వీఆర్వోలు సూచించారు. ఊరు పుట్టినప్పటి నుండి తాము శ్మశానాన్ని ఉప యోగించుకుంటున్నామని గుర్రన్న, మిద్దె నాగేశ్వరరావు, బాలస్వామి రెవెన్యూ అధికారులకు తెలిపారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

నంద్యాల(అర్బన్): తాడిపత్రి డీపీఓ నాగరాజు నాయుడిని పరుష పదజాలంతో దూషించిన తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండన్న డిమాండ్ చేశారు. స్థానిక వాల్మీకి కార్యాలయంలో శనివారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డీపీఓను జేసీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడిన తీరు చూస్తుంటే చైర్మన్‌కు మతిభ్రమించినట్లు ఉందన్నారు. అధికారులు తప్పు చేస్తే కలెక్టర్లకు ఫిర్యాదు చేయాలి కానీ, దుర్భాషలాడటం సరికాదన్నారు. నాయకులు శ్రీనివాసులు, హరి, పుల్లయ్య, చందు, పరమేష్, రమణ పాల్గొన్నారు.

సంక్షేమ కార్యక్రమాలను ఎన్ఎల్ఎం టీం సభ్యులకు వివరించాలి

నంద్యాల: జిల్లాలో భారత ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలను నేషనల్ లెవెల్ మానిటరింగ్ (ఎన్ఎల్ఎం) టీం సభ్యులకు వివరించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం తన చాంబర్‌లో ఎన్ఎల్ఎం టీం సభ్యులు, జిల్లా అధికారులతో భారత ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 19 నుంచి 29వ తేదీ వరకు జిల్లాలోని నంద్యాల, ఉయ్యాలవాడ, జూపాడుబంగ్లా మండలాలకు సంబంధించిన 8 పంచాయతీల్లో నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీం సభ్యులు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తారని చెప్పారు. వారికి జిల్లాలో భారత ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును వివరించాలని చెప్పారు. ముఖ్యంగా వ్యవసాయ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, హౌసింగ్, గ్రామ పంచాయతీల్లో అమలు చేసే డిజిటల్ పంచాయతీలు, ఎన్ఆర్ఈజీఎస్ పనులు, డీఆర్‌డీఏ తదితర అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ఇందులో బెస్ట్ ప్రాక్టీస్ ఏమైనా ఉన్నట్లయితే అందుకు సంబంధించిన వీడియోలు, సమాచారాన్ని వారికి ఇవ్వాలని కోరారు. డ్వామా పీడీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, వ్యవసాయ శాఖ, జిల్లా పంచాయతీ అధికారి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక


సుప్రియను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగిన సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీల్లో నంద్యాలకు చెందిన పాన్నాపురం జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని సుప్రియ ప్రతిభ చూపి జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికై నట్లు హెచ్ఎం ఐజయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు విశ్వనాథ్ తెలిపారు. శనివారం జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థినిని అభినందించారు. 64–67 కేజీల బాలికల విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని చెప్పారు. ఆగస్టులో ఢిల్లీలో జరిగే జాతీయి స్థాయి పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు విశ్వనాథ్‌ను అభినందించారు. ఉపాధ్యాయులు ప్రేమ్ కుమార్, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాసులు, సరోజ, గంగాధర్, రమణ, రసూల్‌బీ పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి


మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రతిఘటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక నరసింహయ్య భవన్‌లో పార్టీ జిల్లా నాయకుల విస్తృత స్థాయి సమావేశాన్ని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఏసు రత్నం అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు ధనలక్ష్మి హాజరయ్యారు. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ, ప్రజల్లో, కార్మికుల్లో అనైక్యతను తీసుకొస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తూ మోదీ విధానాలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. జిల్లాలో పొగాకు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. అదాని, అంబానీలకు సహజ వనరులు, ప్రజా సంపదను కారుచౌకగా కట్టబెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యుత్ స్మార్ట్ మీటర్ల అమలు ఆ కోవకు చెందినవేనన్నారు. కార్మికుల పని గంటలు 10 గంటలకు పెంచాలని, మహిళలను రాత్రిళ్ల పూట పని చేయాలని నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమైన చర్యగా ధనలక్ష్మి అభివర్ణించారు.నాయకులు నాగరాజు, నాగేశ్వరావు, రామచంద్రుడు, నరసింహ నాయక్ పాల్గొన్నారు.

కంబగిరిస్వామికి వెండి నామాల బహూకరణ


స్వామికి వెండి నామాలు అలంకరిస్తున్న అర్చకులు

ఉయ్యాలవాడ : మండలంలోని సుద్దమల్ల గ్రామంలో వెలిసిన శ్రీ లక్ష్మీ నరసింహ కంబగిరి స్వామికి భక్తులు వెండి నామాలు, కోరలు బహూకరించినట్లు అర్చకులు కమలేష్‌శర్మ తెలిపారు. నంద్యాల మండలం అయ్యలూరు గ్రామానికి చెందిన తలారి కొండయ్య, వెంకటలక్ష్మి దంపతులు శనివారం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి వాటిని అందజేశారు. అలాగే మండలంలోని ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన శ్రీ అభయాంజనేయ స్వామి, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, అనంతయ్యలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.